# కామ్రేడ్ జస్వంతరావుకు విప్లవ జోహార్లు

**సి.పి.ఐ.(ఎం-ఎల్) కేంద్ర కమిటీ ప్రకటన**



**మన** ప్రియతమ కామ్రేడ్ జస్వంతరావును కాపాడుకోవాలన్న మన గాఢమైన ఆశలు, ఆకాంక్షలు, ప్రయత్నాలు ఫలించలేదు. కరోనాకు, తీవ్రమైన ఊపిరితిత్తులకు సంబంధించిన జబ్బుతో రెండు వారాలపాటు పోరాడి ఆగస్టు 27, 2020 రోజున రాత్రి 8 గంటలకు తుది శ్వాస వదిలారు. నక్సల్బరీ రైతాంగ విప్లవోద్యమ నేత కామ్రేడ్ కానుసన్యాల్ ప్రధాన కార్యదర్శిగా పునర్నిర్మితమైన **సిపిఐ (ఎం-ఎల్) కేంద్ర కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు** కామ్రేడ్ జస్వంత్; **కేంద్ర ఇంగ్లీష్ పత్రిక 'క్లాస్ స్ట్రగుల్', ఏ.పి. రాష్ట్ర కమిటీ తెలుగు పత్రిక 'జనశక్తి' సంపాదకులు; తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి.**

కామ్రేడ్ జస్వంత్ విద్యార్థి దశలోనే మార్క్సిజాన్ని, కమ్యూనిస్టు రాజకీయాలను స్వీకరించారు. ఐదు దశాబ్దాలకు పైగా కాలంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ, భారతదేశంలోనూ కమ్యూనిస్టు విప్లవోద్యమం ఎదుర్కొన్న అన్ని కష్టసుఖాలలో, మలుపులు, ఎదురుదెబ్బలు, పురోగమనాలలో దృఢంగా, పూర్తి విశ్వాసంతో ముందువరుసన నిల్చున్నారు. వృత్తివిప్లవకారుడిగా, నాయకుడిగా, పార్టీ పత్రికల సంపాదకుడిగా, టి.ఎన్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు.

గ్రామీణ ప్రాంతాలలో కృషిలో భాగంగా కామ్రేడ్ జస్వంత్ గ్రామీణ పేదలమధ్యకు, గిరిజనుల మధ్యకు వెళ్ళారు. వారిమధ్య పనిచేసారు, వారితో మమేకమయ్యారు. గ్రామీణప్రాంత ఆర్థిక పరిస్థితులను, దోపిడీపీడనలను సన్నిహితంగా అధ్యయనం చేసారు. భూస్వామ్యవ్యవస్థ రద్దు, వ్యవసాయ విప్లవ ప్రాముఖ్యతలను మరింత శక్తివంతంగా వివరించడానికి కామ్రేడ్ జస్వంత్‌కు ఇది ఎంతగానో తోడ్పడింది. మార్క్సిజం – లెనినిజం, మావో ఆలోచనా విధానాన్ని, విప్లవకమ్యూనిస్టు రాజకీయాలను, విప్లవప్రజాపంథాను తుదికంటా సమున్నతంగా ఎత్తిపట్టారు.

కామ్రేడ్ జస్వంత్ అధ్యయనశీలి. కామ్రేడ్ టి.ఎన్. నాయకత్వంలో, కామ్రేడ్ టి.ఎన్. ఆలోచనలను, జీవితాన్ని, కృషిని, ఆదర్శంగా తీసుకొని, మార్క్సిజాన్ని, మార్క్సిస్టు అర్థశాస్త్రాన్ని విస్తారంగా, లోతుగా అధ్యయనం చేశారు. ప్రత్యేకించి, కామ్రేడ్ టి.ఎన్. అమరుడైన తర్వాత మార్క్సిజం వెలుగులో కమ్యూనిస్టు విప్లవకార్యక్రమానికి సంబంధించి "తాకట్టులో భారతదేశం"లో కామ్రేడ్ టి.ఎన్. చేసిన మౌలిక సూత్రీకరణలను, విశ్లేషణలను, నిర్ధారణలను భారతనిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి, వివరించడాన్ని ఒక ముఖ్యమైన బాధ్యతగా, రాజకీయ కర్తవ్యంగా స్వీకరించి, దానికోసం ప్రత్యేక కృషిచేశారు. అంతర్జాతీయంగానూ, భారతదేశంలోనూ కమ్యూనిస్టు ఉద్యమం, విప్లవోద్యమాలు ఎదురుదెబ్బలు ఎదుర్కొన్న పరిస్థితుల్లో మార్క్సిజం పైనా, విప్లవరాజకీయాలపైనా దాడులు ముమ్మరం ఐన పరిస్థితుల్లో వాటిని తిప్పికొట్టడానికి, అధ్యయనం, ఆచరణల ఆధారంగా విప్లవ రాజకీయాలను వివరించడానికి విశేష కృషి చేశారు. కామ్రేడ్ జస్వంత్ అసంఖ్యాక రచనలు చేశారు. చిన్న, పెద్ద అసంఖ్యాక సభల్లో, సమావేశాల్లో తన కంచుకంఠంతో శక్తివంతంగా ప్రసంగించారు. కార్మికవర్గం పాల్గొన్న అనేక సమావేశాల్లో పాల్గొని, వారి స్థితిగతులను, కార్మికోద్యమ స్థితిని అధ్యయనం చేశారు. నేటి వ్యవస్థ స్వభావాన్ని, కార్మికవర్గ హక్కులను, జీవితాలను ధ్వంసం చేస్తున్న పాలకవర్గాల విధానాలను ఎండగడుతూ, నూతన ప్రజాతంత్ర విప్లవంలో కార్మిక వర్గం నిర్వహించవలసిన పాత్రను, కార్మిక – కర్షక మైత్రి యొక్క ప్రాముఖ్యతను అనేక సమావేశాల్లో, సభల్లో వివరించారు. వివిధ రాష్ట్రాల్లో పార్టీ ఏర్పాటు చేసిన లేదా ఐక్య వేదికల్లో భారత పాలకవర్గాల విధానాలను, ఆర్థిక సంక్షోభ తీరుతెన్నులను, కారణాలను విశ్లేషిస్తూ, కమ్యూనిస్టు రాజకీయాలను వివరిస్తూ ప్రతిభావంతంగా ప్రసంగించారు. ఈ ప్రసంగాలు, రచనలు కామ్రేడ్స్‌కు, ప్రజలకు ఎంతో స్ఫూర్తివంతంగా, విజ్ఞానదాయకంగా, విశ్వాసాన్ని ఇనుమడింప చేసేవిగా ఉండేవి.

కామ్రేడ్ జస్వంత్ మార్క్సిస్టు మేధావి. కమ్యూనిస్టు విప్లవరాజకీయాలకు జీవితాన్ని పూర్తిగా అంకితం చేసిన నాయకుడు. స్నేహశీలి, అభిప్రాయాల విషయంలో నిశితంగా ఉండడం, పూర్తిస్పష్టత, అధికారికతతో అభిప్రాయాలను వివరించడం కామ్రేడ్ జస్వంత్ విశిష్ట లక్షణం.

మన నాయకులు కామ్రేడ్ కానుసన్యాల్‌గారితో సాన్నిహిత్యం, చర్చల ద్వారా నక్సల్బరీ రైతాంగ విప్లవపోరాట అభివృద్ధి క్రమాన్ని, మరింత లోతుగా అధ్యయనం చేయడానికి విప్లవ ప్రజాపంథా సవ్యతను మరింత శక్తివంతంగా ఎలుగెత్తి చాటడానికి కామ్రేడ్ జస్వంత్ ఉపయోగించుకున్నారు.

సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో అన్ని పరిస్థితులలో తోడుగా, అత్యంత సన్నిహితుడుగా వున్న కామ్రేడ్ జస్వంత్‌ను కోల్పోవడం బాధాకరం. కమ్యూనిస్టు సిద్ధాంతాల పైనా, విశ్వాసాలపైనా కమ్యూనిస్టు ఉద్యమం సాధించిన విజయాలపైనా పెరుగుతున్న దాడులను మరింత దృఢంగా, బలంగా, ఐక్యంగా తిప్పికొట్టవలసిన ఈసమయంలో; కమ్యూనిస్టు విప్లవోద్యమం, విప్లవోద్యమాలు ఎదుర్కొన్న ఎదురుదెబ్బల నుండి, అనైక్యతల నుండి బయట పడటానికి, ఐక్య పార్టీని నిర్మించడానికి తీవ్రమైన కృషి చేయవలసిన, చేస్తున్న ఈ సమయంలో కామ్రేడ్ జస్వంత్ అకాల అమరత్వం మన పార్టీకి, భారత కమ్యూనిస్టు విప్లవోద్యమానికి తీరని నష్టం.

మన ప్రియతమ కామ్రేడ్ జస్వంతరావుకు విప్లవజోహార్లు తెలుపుదాం.

కామ్రేడ్ జస్వంత్ పోరాటస్ఫూర్తితోనే ఈ విపత్తును అధిగమించడానికి, కమ్యూనిస్టు విప్లవోద్యమంలో స్థిరమైన, శక్తివంతమైన ఐక్యతను, ఐక్య పార్టీ నిర్మాణాన్ని సాధించడానికి అవిశ్రాంత కృషి చేద్దాం.

ప్రముఖ ప్రజారచయిత, కళాకారుడు సుంకర సత్యనారాయణగారి మూడవ కూతురు శేషమ్మగారు కామ్రేడ్ జస్వంత్ జీవిత సహచరి. కామ్రేడ్ జస్వంత్‌కు అన్నిరకాలుగా తుదికంటా తోడుగా నిలిచిన శేషమ్మగారికి, పిల్లలకు మన ప్రగాఢ సంతాపం తెలుపుదాం. వారి బాధ, కన్నీళ్లలో పాలు పంచుకుందాం.

**మధు**

**ఆగష్టు 28, 2020**

**సి.పి.ఐ.(ఎం-ఎల్)**

**కేంద్ర కార్యదర్శివర్గం**